సాక్షి
ములుగు

ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023



మళ్లీ మొదటికి..
గ్రూప్–1 ప్రిలిమ్స్ రద్దు చేస్తున్నాం. మళ్లీ రాయాలని హైకోర్టు తీర్పు ఇవ్వడంతో అభ్యర్థులు కన్నీరుమున్నీరవుతున్నారు. - 8లో▸



పేదల వ్యతిరేక ప్రభుత్వాలను ఓడించాలి
పేదల వ్యతిరేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఓడించాలని రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి పిలుపునిచ్చారు. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం $29^0/25^0$
జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మామూలుగా ఉంటాయి. సాయంత్రం చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

తైక్వాండో పోటీలకు విద్యార్థుల ఎంపిక



వాజేడు: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు నాగారం పాఠశాల ఉపాధ్యాయుడు ఇర్ప బాలాజీ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన సోలం ఉమాశంకర్ 23కేజీల విభాగం, సీతారామచంద్రారెడ్డి 30కేజీల విభాగంలో ఎంపికై నట్లు వివరించారు. నేడు వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఇద్దరు విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు.

ఉద్యోగాల భర్తీలో ప్రభుత్వం విఫలం



ములుగు రూరల్: ఉద్యోగాలు భర్తీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉద్యోగ నియామకాల కోసం ఏర్పాటు చేసిన టీఎస్‌పీఎస్సీ నిర్వహణ సరిగా లేకపోవడం అసమర్థపాలనకు అద్దం పడుతోందని తెలిపారు. ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేస్తే నిరుద్యోగులు కోర్టులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయడంలో కాలయాపన చేస్తూ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు భృతి చెల్లిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సునీల్, గణేష్, చందు, వేణు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యూత్ సభ్యులకు టీషర్ట్స్ పంపిణీ



వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలోని బంజారా యూత్ సభ్యులకు శనివారం టీషర్టులు, జూట్ బ్యాగులను రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ భూక్య దేవ్‌సింగ్ పంపిణీ చేశారు. అనంతరం బంజారా యూత్ సభ్యులు ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవ్‌సింగ్ మాట్లాడుతూ అభివృద్ధిలో ములుగు నియోజకవర్గం వెనుకబడిపోయిందన్నారు. ప్రజా శ్రేయస్సు కోసమే తాను ఎమ్మెల్యేగా పోటీ చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజలు ఆదరించి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు బానోతు సునీల్, ఉపాధ్యక్షుడు బానోతు యోగి, కోశాధికారి కపిల్‌దేవ్, కార్యదర్శి కరణ్‌సింగ్, మంద రమేష్, విజయ్, గోపాల్, జీవన్, రవీందర్, రఘురాం, రాహుల్, నాగరాజు, జయరాం తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను కాపాడాలి

చిట్యాల: సంపద వనాలలో మొక్కలను నాటి వాటిని కాపాడాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని ఒడితల, నైన్‌పాక గ్రామాలలో ఏర్పాటుచేసిన సంపద వనాలను అదనపు కలెక్టర్ సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంపద వనాలలో సంపదనిచ్చే మొక్కలను నాటి చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటుచేయాలని తెలిపారు. వాటి వివరాల కోసం నేమ్ బోర్డు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

రహస్యంగా విచారణ

గణపురం: మూడు నెలల క్రితం కేటీపీపీలో జరిగిన చోరీని పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. అత్యంత రహస్యంగా విచారిస్తున్న పోలీసులు నలుగురు నిందితులను గుర్తించి శుక్రవారం రాత్రి ఒకరిని రిమాండ్‌కు తరలించారు. పోలీసుల అదుపులో మరో ముగ్గురు ఉన్నారు. కాకతీయ థర్మల్ విద్యుత్‌కేంద్రంలోని స్టోర్ రూంలలో ఉన్న రూ.82. 40లక్షల కాపర్, కంచు మెటీరియల్ వస్తువులు చోరీకి గురయ్యాయని జూన్ 6వ తేదీన కేటీపీపీ అధికారులు గణపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. 60మందిని అనుమానితులుగా గుర్తించి ఈనెల 20న విచారణకు హాజరుకావాలని వారు ఆదేశించారు. గురు, శుక్రవారం ఉద్యోగులు విచారణకు హాజరయ్యారు. నలుగురిని పోలీసులు నిందితులుగా గుర్తించారు. చెల్పూరుకు చెందిన కల్యాణి ఇంజనీర్ వర్క్ షాపు యజమాని ఠాగూర్‌ను శుక్రవారం అర్ధరాత్రే రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం. చోరీకి గురైన వస్తువులు అతని వద్దనే దొరికినట్లు సమాచారం. సదరు వ్యక్తి ఇచ్చిన సమాచారంతో మరో జేపీఏ, సెక్యూరిటీ గార్డు, ఆర్టిజన్లు ముగ్గురిని అదుపులో ఉంచుకున్నట్లు సమాచారం.

మురుగునీరు.. దుర్వాసన

- డ్రెయినేజీల్లో నిల్వ.. చెత్తాచెదారం
- పలుచోట్ల రోడ్లపై పారుతున్న వైనం
- ఖాళీ ప్లాట్లలో నిలుస్తున్న వర్షపు నీరు
- దోమల స్వైర విహారం
- జ్వరాల బారిన ప్రజలు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్యం పడకేసింది. పల్లెల కన్నా అధ్వానంగా ఉంది. డ్రెయినేజీల పరిస్థితి దారుణంగా తయారైంది. చెత్తా చెదారం, సిల్ట్‌తో నిండిపోయి దుర్వాసన వస్తోంది. పలు చోట్ల రోడ్లపై నీరు పారుతున్న పరిస్థితి ఉంది. అదే విధంగా ఖాళీ ప్లాట్లలో వర్షపు నీరు నిలిచి ఉంటుంది. దీంతో దోమలు విపరీతంగా పెరిగిపోయి ప్రజలు జ్వరాల బారిన పడుతూ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. జిల్లా కేంద్రంలో పారిశుద్ధ్య సమస్యపై శనివారం 'సాక్షి' పరిశీలించగా అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయి.

– ములుగు



ఖాళీ ప్లాట్లలో వర్షపు నీరు

పై ఫొటో శ్రీనివాస కాలనీది. ఇక్కడ సుమారు 50 నుంచి 80 కుటుంబాల ప్రజలు నివసిస్తున్నారు. రియల్ ఎస్టేట్ ఒక్కసారిగా పెరగడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్లాట్లు కొనుగోలు చేసి వదిలేశారు. దీంతో ఖాళీ ఇళ్ల ప్లాట్లలో నిలిచిన వర్షపు నీరు. పిచ్చి మొక్కలతో చెరువును తలపిస్తున్నాయి. దీనికి తోడు చుట్టు పక్కల అన్ని ప్లాట్లల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. ఈ విషయంపై స్థానిక పంచాయతీ అధికారులను పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు మండి పడుతున్నారు. ఏదో నామమాత్రంగా రాత్రి సమయంలో దోమల మందు ఫాగింగ్ చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.

ప్రజలకు తప్పని తిప్పలు



ములుగు గ్రామపంచాయతీ ఎదురుగా కూరగాయల మార్కెట్‌కు వెళ్లే దారి వెంట ఉన్న డ్రెయినేజీలో మురుగు నీరు నిల్వ ఉంది. ప్రతిరోజూ గ్రామ పంచాయతీ సిబ్బంది డ్రెయినేజీలోని చెత్తాచెదారాన్ని తొలిగిస్తున్నారే తప్ప మురుగు నీటిని బయటకు పంపించే విధంగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ప్రతీ ఆదివారం నిర్వహించే అంగడికి వచ్చే మహిళలు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

పందులకు ఆవాసంగా..



గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కన గల గల్లీలో గతంలో ఎప్పుడో కొన్న ప్లాట్లలో తుమ్మ చెట్లు ఏపుగా ఎదిగాయి. అందులో వర్షం నీరు నిల్వగా పందులు ఆవాసాలుగా మార్చుకున్నాయి. ఈ బురదలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో స్థానిక ప్రజలు దుర్వాసన వస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు.

దారివెంట నీరు



ములుగు గ్రామ పంచాయతీ నుంచి శ్రీనివాస కాలనీ, ప్రగతి కాలనీ, సేవాలాల్ గుడి, నూతన వెంచర్‌లో నిర్మించిన ఇళ్లకు వెళ్లే దారివెంట డ్రెయినేజీ లేక పోవడంతో మురుగు నీరు రోడ్లపై పారుతోంది. రోడ్లపై నడిచి వెళ్లే ప్రజలు దుర్గంధం భరించలేక ముక్కు మూసుకుని వెళ్లాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం, సాయంత్రం బ్లీచింగ్ పౌడర్ చల్లడానికి వస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రజలు సమస్యలు అర్థం కావడం లేదా అని ప్రశ్నిస్తున్నారు.

ప్రధాన రోడ్ల వెంబడి చెత్తనే తొలగిస్తున్నారు..



ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామ పంచాయతీ సిబ్బంది ట్రాక్టర్లు, పారలు, గడ్డ పారలతో జాతీయ రహదారిపై పనులు చేస్తూ కనిపించడం తప్పా పట్టణంలోని కాలనీ ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదు. ఎప్పుడు గ్రామ పంచాయతీకి వెళ్లినా సర్పంచ్ ఉండరు. ఆమె భర్త మాత్రమే ఉంటారు. అధికారులకు విన్నవించుకుంటే సర్పంచ్‌ని అడుగండి అంటున్నారు.

- కుమార్ పాడియా, ప్రగతి కాలనీ

అందుబాటులో లేని ఈఓ..

ఈ విషయంపై పంచాయతీ ఈఓ(ఎంపీఓ) రహీంను పలుమార్లు సంప్రదించేందుకు కార్యాలయానికి వెళ్లగా ఆయన విధుల్లో లేరు. ఫోన్‌లో సంప్రదించే ప్రయత్నం చేయగా అందుబాటులోకి రాలేదు.

ఆరోగ్యమే మహాభాగ్యం



హెల్త్‌క్యాంపులో మాట్లాడుతున్న లలిత శివజ్యోతి

ములుగు: ఆరోగ్యమే మహాభాగ్యమని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీవీపీ లలిత శివజ్యోతి అన్నారు. జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో హెల్త్ క్యాంపును శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీవీపీ లలిత శివజ్యోతి హాజరై మాట్లాడారు. నిత్య జీవితంలో పనుల్లో భాగంగా మనం ఆరోగ్యం గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఉద్యోగంతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య, సీనియర్ సివిల్ జడ్జి మాధవి, జూనియర్ సివిల్ జడ్జి రాంమోహన్ రెడ్డి, రవీందర్, మెడికల్ ఆఫీసర్లు ప్రేమ్‌సింగ్, వేణుగోపాల్‌చారి, మహేందర్, భిక్షపతి, కొండి రవీందర్, సునీల్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పెంచిన వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట బతుకమ్మ ఆడి నిరసన తెలుపుతున్న కార్మికులు

ములుగు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం పెంచిన వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బండి నర్సయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో వంట కార్మికులు చేపట్టిన సమ్మె శనివారానికి నాల్గవ రోజుకు చేరుకోగా సమ్మెలో భాగంగా కలెక్టరేట్ ఎదుట బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. పాఠశాలల్లో వంటలు వండడం నిలిపి వేసి కార్మికులు సమ్మె చేపడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో నూతనంగా ప్రవేశపెడుతున్న అల్పాహారానికి అదనపు వేతనం చెల్లించాలన్నారు. వంట సామగ్రి గ్యాస్, కోడిగుడ్లు, కూరగాయలు ప్రభుత్వం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ముత్యాల రాజు, పైడిబాబు, యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు పోరెడ్డి ప్రమీల, శోభ, రమ, రాజకుమారి, స్వరూప, పద్మ, సరోజన, నిర్మల, భాగ్య, సాంబలక్ష్మి, లక్ష్మి, సునీత, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత

- బాడీ బిల్డింగ్ క్రీడలను ప్రారంభించిన సింగరేణి జీఎం



బాడీ బిల్డింగ్ క్రీడలను ప్రారంభిస్తున్న జీఎం బళ్లారి శ్రీనివాసరావు

భూపాలపల్లి రూరల్: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడాలని క్రీడలతో మానసిక ప్రశాంతత, శారీరక ఆరోగ్యం పెంపొందుతుందని సింగరేణి జనరల్ మేనేజర్ బళ్లారి శ్రీనివాసరావు అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలో వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రీజనల్ లెవెల్ బాడీ బిల్డింగ్ క్రీడాపోటీలను జీఎం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసికంగా దృఢంగా తయారయ్యే అవకాశం ఉంటుందన్నారు. క్రీడాకారులు రీజనల్ స్థాయి పోటీలలో విజేతలుగా నిలిచి తదుపరి జరగబోయే కంపెనీ స్థాయి పోటీలలో గెలుపొంది కోల్ ఇండియా పోటీలలో సింగరేణి విజయ పతాకాన్ని రెపరెపలాడేలా కృషి చేయాలని జీఎం కోరారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ అజ్మీర తుకారాం, అధికారులు శ్యాం ప్రసాద్, శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి, దేవయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


- డీపీఓ ఆశలత



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీపీఓ ఆశలత

కాటారం: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా పంచాయతీ అధికారిణి ఆశలత సూచించారు. కాటారం మండలం శంకరాంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లపల్లిలో విషజ్వరాలు ప్రబలుతుండటంతో కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఓ శనివారం గ్రామంలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. ఇంటింటికీ తిరిగి పారిశుద్ధ్యం పరిశీలించి గ్రామస్తులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఇంటి పరిసరాల్లో పాత ఇనుప సామగ్రి, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని.. లేకుంటే దోమలు వ్యాప్తిచెంది వ్యాధులు సంక్రమిస్తాయని అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యమని తెలిపారు. వైద్యులు, సిబ్బందితో మాట్లాడి విషజ్వరాలపై ఆరాతీశారు. జ్వరాలు నియంత్రించేలా వైద్యసేవలు అందించాలని సూచించారు. పంచాయతీ అధికారులు, సిబ్బంది పారిశుద్ధ్య నిర్వహణ పనులను ముమ్మరంగా చేపట్టాలని పిచ్చిమొక్కలు, మురుగునీటి నిల్వలను తొలిగించి క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు. బ్లీచింగ్ పౌడర్ చల్లాలని ఆదేశించారు. డీపీఓ వెంట ఎంపీఓ ఉపేంద్రయ్య, వైద్యురాలు మౌనిక, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

కొనసాగుతున్న పోషణ్ అభియాన్



ఎర్రయ్యపల్లిలో పాల్గొన్న పిల్లలు

భూపాలపల్లి రూరల్: పోషణ్ అభియాన్ కార్యక్రమం జిల్లాలో కొనసాగుతోంది. నెలాఖరు వరకు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భూపాలపల్లి, మహదేవపూర్ ప్రాజెక్టులలో ఉన్న మండలాల్లోని గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో 644 అంగన్‌వాడీ కేంద్రాలుండగా అందులో 77 కేంద్రాల్లో టీచర్లు, ఆయాలు ఈనెలలో 11 రోజుల పాటు సమ్మె చేశారు.సమ్మె ప్రభావం పిల్లలపై పడిందనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రజల్లో పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ, స్వచ్ఛంద సంస్థలు, పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు, ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని ఈ నెలాఖరు వరకు నిర్వహించనున్నారు.


అవగాహన కల్పిస్తున్నాం..
పిల్లల్లో ఎత్తు, బరువు పెరుగుదల, పరిశుభ్రత తదితర అంశాలపై అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల తల్లులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. 11రోజులు సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా ఇన్‌చార్జ్‌లను ఏర్పాటు చేసి పిల్లలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాం.

- నాగేశ్వర్‌రావు, జిల్లా సంక్షేమాధికారి

ఉచిత వైద్యశిబిరాలు



పిల్లలతో మాట్లాడుతున్న వైద్య నిపుణులు



వైద్య శిబిరంలో వైద్యులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండల పరిధిలోని బీరెల్లి, నర్సాపూర్ గ్రామాల్లోని ప్రజలకు మల్లారెడ్డి ఇనిస్ట్యూట్ అనుసంధానంతో డాక్టర్ తుమ్మ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరంలో దంత వైద్య నిపుణుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రొఫెసర్ సజ్జన్, స్పెషలిస్ట్ జనరల్ మెడిసిన్ డాక్టర్లు, సుశాంత్, శాంతన్, స్త్రీ వైద్య నిపుణులు స్వేత, పిల్లల వైద్య నిపుణులు దినేష్‌రెడ్డి, కంటి వైద్య నిపుణులు చంద్రశేఖర్లు గ్రామాల్లోని 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. రెండు రోజుల గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించినట్లు వైద్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో 17మంది జూనియర్ డాక్టర్లు, డెంటల్, కంటి నిపుణులు, ఫార్మాసిస్టులు, స్టాఫ్ నర్సులు, 32 మంది పీఆర్‌ఓలు పాల్గొన్నారు.

నెరవేరిన కల

- మల్లంపల్లి మండలం ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- సాధన సమితి పోరాట ఫలితంగానే..
- 14 గ్రామాలతో మండల స్వరూపం
- సంబురాలు జరుపుకుంటున్న ప్రజలు



మల్లంపల్లి మండలం కోరుతూ సాధన సమితి ఆధ్వర్యంలో దీక్షలు(ఫైల్)

ములుగు రూరల్: మల్లంపల్లి మండలం ఏర్పాటు చేయాలనే ప్రజల కల నెరవేరింది. 14 గ్రామాలతో మండలం ఏర్పాటు చేస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సాధన సమితి సభ్యులతో పాటు మండల ప్రజలు సంబురాలు జరుపుకున్నారు. తెలంగాణ రాష్ట్రం అవతరించిన సమయంలో నూతన జిల్లాలను ఏర్పాటు చేసిన ప్పటి నుంచి మల్లంపల్లిని మండలం చేయాలనే డిమాండ్ ఉంది. ఈ మేరకు 2018 ఎన్నికల సమయంలో మల్లంపల్లి మండల సాధన సమితిని ఏర్పాటు చేసుకొని ఉద్యమాలు చేపట్టారు. ఈ క్రమంలో ఎన్నికల సమయంలో ములుగులో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో సీఎం కేసీఆర్ ములుగు జిల్లాతో పాటు మల్లంపల్లిని మండలంగా ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. అయినా మండల ఏర్పాటు చేయకపోయినా సాధన సమితి కమిటీ నాయకులు సహనం వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలు సర్పంచ్, ఎంటీటీసీ, ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రతీసారి అధికార పార్టీ నాయకులు హామీలను ఇచ్చి తప్పుకుంటున్నారని మండలసాధన సమితి ఆధ్వర్యంలో మల్లంపల్లిలో రిలే నిరాహార దీక్షలను కొనసాగించారు. దీంతో పాటు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, గిరిజనశాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఐటీశాఖ మంత్రి కేటీఆర్, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావులను కలిసి మండల డిమాండ్‌ను తెలియజేశారు. ఇటీవల ములుగు జిల్లా జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ మరణించగా కార్యక్రమానికి హాజరై కేటీఆర్ జేడీ మల్లంపల్లి మండలంగా ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో రాజకీయాలకు అతీతంగా జేఏసీ ఏర్పాటు చేసుకొని ఉద్యమాలను ఉధృతం చేశారు.

14 గ్రామాలతో ఏర్పాటు
మల్లంపల్లి మండల స్వరూపం 14 గ్రామాలతో ఏర్పాటు కానుంది. మల్లంపల్లి, రాంచంద్రాపూర్, భూపాల్‌నగర్, శ్రీనగర్, ముద్దునూరుతండా, గుర్తూరుతండా, కొడిశలకుంట, దేవనగర్, మహ్మద్ గౌస్‌పల్లి, శివతండా గ్రామాలతో పాటు హన్మకొండ జిల్లా శాయంపేట మండల పరిధిలోని కాట్రపల్లి, సాధన పల్లి, రాజుపల్లి, నూర్జాన్‌పల్లి గ్రామాలతో మండలం ఏర్పాటు కానుంది. ఇందులో మల్లంపల్లి, రాంచంద్రాపూర్, కాట్రపల్లి రెవెన్యూ గ్రామాలుగా ఉన్నాయి. మండల పరిధి గ్రామాలలో 2011 జనాభా లెక్కల ప్రకారం 20,986 మంది ఉన్నారు.



మల్లంపల్లి మండలం ప్రకటించడంతో సంబురాల్లో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి



జేఏసీ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ర్యాలీ(ఫైల్)

జేడీ మల్లంపల్లిగా ప్రకటిస్తారా?
ములుగు తొలి జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ అకాల మరణంతో మల్లంపల్లిని జేడీ మల్లంపల్లిగా ప్రకటించాలని మల్లంపల్లి వాసులు అధికార పార్టీ మంత్రులకు విన్నవించారు. ఈ క్రమంలో అమాత్యులు మల్లంపల్లిని జెడ్పీ మల్లంపల్లిగా ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. అయితే ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్‌లో మాత్రం మల్లంపల్లి అని మాత్రమే ఉంది. మల్లంపల్లి ప్రజల ఆకాంక్ష మేరకు జేడీ మల్లంపల్లిగా నామకరణం చేస్తే బాగుంటుంది.

బాణసంచా కాల్చి సంబురాలు
రాష్ట్ర ప్రభుత్వం మల్లంపల్లిని మండలంగా ప్రకటించడంతో ప్రజలు బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. గెజిట్ విడుదల చేసిన వెంటనే జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అధికార పార్టీ నాయకులు మల్లంపల్లి చేరుకొని జై కేసీఆర్, జై కేటీఆర్ అంటూ నినాదాలు చేస్తూ సంబురాలు జరుపుకున్నారు. ప్రజలు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు



ములుగు: మల్లంపల్లిని మండలంగా ప్రకటించిన సీఎం కేసీఆర్‌కు రెడ్కో చైర్మన్ సతీష్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మల్లంపల్లి ప్రజల మనసులో ఉన్న కోరికను కేసీఆర్ నెరవేర్చినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అందుకు సహకరించిన మంత్రులు దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. దివంగత జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ మల్లంపల్లి మండలం ఏర్పాటుకు ఎంతో కృషి చేశారని వివరించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బడే నాగజ్యోతిని అధిక మెజార్టీతో గెలిపించే బాధ్యత మల్లంపల్లి ప్రజలపై ఉందన్నారు.

- సతీష్ రెడ్డి, రెడ్కో చైర్మన్

ఉద్యమకారుడి పేరును నామకరణం చేయాలి



తెలంగాణ ఉద్యమకారుడు, దివంగత జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ పేరును జేడీ మల్లంపల్లిగా ప్రకటిస్తే బాగుంటుంది. 2018 నుంచి సాధన సమితి ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపట్టాం. సీఎం కేసీఆర్ మల్లంపల్లిని మండలంగా ప్రకటించడం సంతోషంగా ఉంది.

- గోల్కొండ రాజు, సాధన సమితి అధ్యక్షుడు

ఆత్మ బలిదానానికి సిద్ధపడ్డా..



తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో మల్లంపల్లి మండల సాధన సమితి ఉద్యమాలను చేపట్టాం. అధికార పార్టీ నాయకులు, మంత్రులు ఇచ్చిన హామీలను అమలు చేయలేదనే మనోవేదనతో మండలం ఏర్పాటు చేయాలని కోరుతూ ఆత్మ బలిదానానికి సిద్ధపడ్డాను. ప్రజల ఆకాంక్ష కోసం అలుపెరగని పోరాటం సాధన సమితి చేపట్టింది. ఎట్టకేలకు మండలం ప్రకటించడం ఆనందంగా ఉంది.

- అజయ్, మండల సాధన ఉద్యమకారుడు

గిర్నిబావిలో పోలీసుల తనిఖీ..

● రూ. 18.90 లక్షల నగదు పట్టివేత


నగదును పరిశీలిస్తున్న ఏసీపీ తిరుమల్

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలో శనివారం వరంగల్–నర్సంపేట ప్రధాన రహదారిపై సీఐ పూల్యాల కిషన్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. కార్లు, ద్విచక్రవాహనాలు, లారీలు, జీపులను ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో వరంగల్ నుంచి నర్సంపేట వైపునకు వెళ్తున్న టీఎస్ 04ఈజె6918 నంబర్ గల కారును ఆపి తనిఖీ చేయగా రూ. 15.60 లక్షల నగదు లభించింది. దీంతో కారులో ప్రయాణికుస్తున్న కన్నెటి ప్రభాకర్‌రావు, లక్ష్మణ్‌రావును వివరణ కోరగా తాము మిర్చి వ్యాపారులమని, వరంగల్ నుంచి ఖమ్మం వెళ్తున్నామని చెప్పారు. అలాగే, కంచరకుంట్ల మురళీధర్‌రెడ్డి వాహనంలో రూ. 2లక్షలు, మల్లాది రాజేందర్‌రెడ్డి వాహనంలో రూ. 1.30లక్షలు లభించగా మొత్తం రూ. 18.90 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న నర్సంపేట ఏసీపీ తిరుమల్ గిర్నిబావికి చేరుకుని నగదుపై ఆధారాలు చూపాలని సదరు వ్యక్తులను అడిగారు. అయితే వారు చూపిన ఆధారాలు నమ్మకంగా లేకపోవడంతో కేసు నమోదు చేయాలని సీఐ కిషన్‌ను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పూర్తి ఆధారాలు చూపితే నగదును అందజేస్తామన్నారు. ఆధారాలు లేకుండా డబ్బుతో ప్రయాణించొద్దన్నారు. కార్యక్రమంలో దుగ్గొండి, నల్లబెల్లి, ఖానాపురం ఎస్సైలు జక్కుల పరమేష్, నగేష్, మధు, సిబ్బంది పాల్గొన్నారు.

అదును చూసి అపహరణ..

● తాళం వేసి ఉన్న ఇంట్లో భారీ చోరీ
● 375 గ్రాముల బంగారం, 700 గ్రాముల వెండి అపహరణ
● ఘటనా స్థలిని పరిశీలించిన ఏసీపీ డేవిడ్‌రాజ్


ఘటనా స్థలిని పరిశీలిస్తున్న ఏసీపీ డేవిడ్‌రాజ్

ఎల్కతుర్తి : ఇంటి యజమాని అనారోగ్యానికి గురయ్యారు. దీంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. ఈ సమయంలో ఇంటి తాళం వేసి వెళ్లారు. ఇంకేముంది.. ఇదే అదునుగా భావించిన దుండగులు భారీ చోరీకి పాల్పడ్డారు. 375 గ్రాముల బంగారం, 700 గ్రాముల వెండిని అపహరించారు. దీంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటన భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలో జరిగింది. ఎస్సై సాయిబాబు కథనం ప్రకారం గ్రామానికి చెందిన మంచాల వెంకటేశ్వర్లు అనారోగ్యానికి గురికాగ చికిత్స నిమిత్తం ఈనెల 12న హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంట్లో చొరబడి బీరువాలో ఉన్న 375 గ్రాముల బంగారం, 700 గ్రాముల వెండి అపహరించుకెళ్లారు. ఇదిలా ఉండగా చికిత్స పొందిన అనంతరం ఈ నెల 22వ తేదీన బాధితులు ఇంటివచ్చి చూడగా తాళం పగలగొట్టి ఉంది. అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై సాయిబాబు ఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం బాధితుల ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టాస్క్‌ఫోర్స్ సీఐపై వరంగల్ సీపీకి ఫిర్యాదు

వరంగల్ క్రైం: టాస్క్‌ఫోర్స్ సీఐ అల్లం రాంబాబుపై అడ్వకేట్ కిషన్ కుమార్‌గౌడ్ శనివారం సీపీ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. రిటైర్డ్ డీఆర్ పరిటాల సుబ్బారావు భూమి విషయంలో తగదా రావడంతో టాస్క్‌ఫోర్స్ సీఐ రాంబాబు తన కార్యాలయంలో సుబ్బారావును ఇష్టా నూసారంగా మాట్లాడారు. దీనిపై కిషన్‌కుమార్‌గౌడ్, సుబ్బారావు సీపీకి ఫిర్యాదు చేశారు. స్పందించిన సీపీ రంగనాథ్.. ఇన్‌స్పెక్టర్ రాంబాబుపై విచారణకు ఆదేశించినట్లు సమాచారం.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పురా, హన్మకొండ
Cell: 9989299661

మళ్లీ మొదటికి..

అభ్యర్థుల సమయం, శ్రమ బూడిదలో పోసిన పన్నీరే..

● ఇప్పటికే రెండుసార్లు రాసిన గ్రూప్–1 ప్రిలిమ్స్
● ఇప్పుడు మళ్లీ రద్దుతో విసిగిపోతున్న నిరుద్యోగులు
● కోచింగ్ కోసం వేలాది రూపాయలు ఖర్చు
● నిరుద్యోగిపై అదనపు భారం పడుతుందని ఆవేదన


పరీక్ష రాస్తున్న ఉద్యోగార్థులు(ఫైల్)

సాక్షి, మహబూబాబాద్/హనుమకొండ/వరంగల్: సుదీర్ఘ కాలం తర్వాత తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన గ్రూప్–1 ఉద్యోగాల భర్తీ పరీక్ష ఒక్క అడుగు ముందుకు.. నాలుగు అడుగులు వెనక్కి అన్నట్లు సాగుతోంది. సివిల్స్‌లో విఫలమైన వారు కొందరు.. ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగానికి సెలవు పెట్టి మరికొందరు.. యూనివర్సిటీలు, కోచింగ్ సెంటర్లలో ఏళ్ల తరబడి ఉంటూ.. ఉద్యోగం కోసమే జీవితం అన్నట్లు కఠోర శ్రమ చేస్తున్న ఇంకొందరు.. ఇలా అందరూ ఇప్పటికే రెండు సార్లు పరీక్ష రాసి మెయిన్స్ కోసం చదువుతున్నారు. ఈ నేపథ్యంలో 'గతంలో నిర్వహించిన ప్రిలిమ్స్ రద్దు చేస్తున్నాం. మళ్లీ రాయాలని' హైకోర్టు తీర్పు ఇవ్వడంపై కన్నీరుమున్నీరవుతున్నారు. మళ్లీ పరీక్ష మొదటి నుంచి రాయాలా అని నిస్సాహాయత తెలియజేస్తున్నారు.

ప్రభుత్వ వైఫల్యానికి యువత బలి

సర్కారు.. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడంలో విఫలమైంది. అసలు పరీక్ష పేర్లతో సంబంధం లేకుండా కొందరికి.. పేపర్‌ను లీక్ చేసి మరికొందరికి ఉద్యోగాలు ఇవ్వాలని చూసింది. అధికారుల నిర్లక్ష్యంతో పరీక్ష పేపర్లు అంగట్లో సరుకయ్యాయి. ఫలితంగా ఒకే పరీక్షను మూడు సార్లు రాయమని నిరుద్యోగులకు చెప్పి వారి సమయం, ధనం, శ్రమ వృథా చేస్తున్నారు. దీనికి ప్రభుత్వమే మూల్యం చెల్లించాల్సి ఉంటుందని యువత డిమాండ్ చేస్తోంది.

సంవత్సరాల తరబడి చదువు

గ్రూప్–1 ఉద్యోగం సాధించాలని యువత భారీగా ఆశలు పెట్టుకుంది. ఇప్పటికే ఉపాధ్యాయులు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు, ఐసీడీఎస్, ఏసీటీవోలతోపాటు వివిధ కేటగిరీల్లో ఉద్యోగాలు చేసేవారు. గ్రూప్–1 నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి ఉద్యోగాలకు సెలవు పెట్టి లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి చదువుతున్నారు. అదేవిధంగా ఉద్యోగ సాధనే ధ్యేయంగా నాలుగు పదుల వయసువచ్చినా..పెండ్లి చేసుకోకుండా యూనివర్సిటీల్లో పాగావేసి గడ్డం, మీసాలు పెంచుకొని కొందరు.. నెత్తిపై ఉన్న వెంట్రుకలు రాలిపోయే అంత టెన్షన్‌తో మరికొందరు చదువుతున్నారు. ఇందుకోసం కోచింగ్ సెంటర్లు, మెటీరియల్స్ కోసం లక్షలాది రూపాయలు అప్పులు చేసిన వారు కూడా ఉన్నారు. ఇప్పుడు మళ్లీ ప్రిలిమ్స్ రద్దు అంటే అందరి జీవితాలతో ఆడుకోవడమే.

జూన్‌లో జరిగిన గ్రూప్-1 పరీక్షకు హాజరైన అభ్యర్థులు			
జిల్లా	మొత్తం	హాజరైంది	సెంటర్లు
వరంగల్, హనుమకొండ	21,038	13,929	55
భూపాలపల్లి	2369	1516	09
ములుగు	1,931	1,262	07
జనగామ	2330	1079	14
మహబూబాబాద్	4046	2663	13

టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలి


గ్రూప్–1 రద్దు అత్యంత బాధాకరం. ఇప్పటికి రెండుసార్లు రాసిన. మళ్లీ రాయాల్సిన పరిస్థితి రావడం దారుణం. దీనిపై ప్రభుత్వం స్పందించి టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలి. లేదా కమిషన్ చైర్మన్ తొలగించి నూతన నోటిఫికేషన్ జారీ చేయాలి.
- మారపాక కిశోర్, కురవి

ఒక్క పరీక్షను ఎన్నిసార్లు రాపిస్తారు


ఒక్క గ్రూప్–1 ప్రిలిమ్స్‌ను ఎన్నిసార్లు రాపిస్తారు.. ఇది ప్రభుత్వమేనా.. నిర్వహించేవి ఉద్యోగాల భర్తీ పరీక్షేనా.. గ్రూప్–1 పరీక్ష రద్దడం అత్యంత దారుణం. వరుసగా విఫలమవుతున్న ప్రభుత్వానికి యువత బుద్ధి చెబుతారు.
- ఆవుల వేణు, మహబూబాబాద్

ఆసక్తి సన్నగిల్లుతోంది


రెండోసారి గ్రూప్–1 ప్రిలిమ్స్ రద్దు వల్ల చదువుకోవాలనే ఆసక్తి సన్నగిల్లుతోంది. ఇంత అధ్వానంగా పరీక్షలు నిర్వహించడాన్ని గతంలో ఎప్పుడూ చూడలేదు. ఇప్పటి వరకు రూ.3 లక్షలు ఖర్చయ్యాయి. టీఎస్‌పీఎస్సీ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది.
- తిరుపతి రెడ్డి, గణపురం, భూపాలపల్లి

నిరుద్యోగులు రోడ్డున పడుతున్నారు


గ్రూప్–1 ప్రిలిమ్స్ ఫలితాలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న తరుణంలో టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పరీక్షను హైకోర్టు రద్దు చేసింది. ఈ పరిణామం మానసికంగా ఆందోళనకు గురి చేసింది. పరీక్షకు మళ్లీ సన్నద్ధం కావాలంటే క్లిష్ట పరిస్థితులను ఎదుర్కోవాలి. కొందరు చేసిన తప్పిదాలకు లక్షలాది మంది నిరుద్యోగులు రోడ్డున పడుతున్నారు.
- బెల్లపురి సాయికుమార్, జనగామ

ఆశ చచ్చిపోయింది


నేను ఉపాధ్యాయుడిని. కొంతకాలంగా గ్రూప్–1 పరీక్షలకు సిద్ధమవుతున్న. ఈ క్రమంలో మరోసారి గ్రూప్–1 రద్దు కావడం వల్ల ఉద్యోగం సాధించాలనే ఆశ చచ్చిపోయింది. ఉన్నత ఉద్యోగాల భర్తీలో ఇలా జరగడం ప్రభుత్వం, టీఎస్‌పీఎస్సీ చిత్తశుద్ధి కనిపిస్తోంది.
- పి.చక్రపాణి, వరంగల్

మళ్లీ మొదటి నుంచి చదవాలి


గ్రూప్–1 నోటిఫికేషన్ ఇచ్చి రెండేళ్లు దాటింది. నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి కోచింగ్‌కు వెళ్లి పరీక్ష రాస్తున్నాం. ఇప్పటి వరకూ పూర్తి కాలేదు. పరీక్షలు ఇప్పటికే రెండు సార్లు రద్దు అయ్యాయి. దీంతో మళ్లీ రాయాలంటే మొదటి నుంచి చదవాలి. ఉద్యోగాలు ఇవ్వొద్దని ఉద్దేశంతోనే ఇదంతా జరుగుతున్నట్లు అనిపిస్తోంది.
- కె.శ్రీజిత, విద్యార్థిని, హనుమకొండ

కూలికి వెళ్లొస్తా..జాగ్రత్త బిడ్డా..!

కూతురికి జాగ్రత్తలు చెప్పి పనికి వెళ్తూ మహిళ దుర్మరణం..

● నాయుడు పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డు ప్రమాదం.. అక్కడికక్కడే మృతి
● మరో ఇద్దరికి స్వల్ప గాయాలు
● 108లో ఎంజీఎంకు తరలింపు


ఘటనా స్థలిలో మహిళ మృతదేహం

ఖిలా వరంగల్: జాగ్రత్తగా బడికి పోయిరా.. కూలికి వెళ్లొస్తా అంటూ ..బిడ్డకు జాగ్రత్తలు చెప్పి పనికి బయల్దేరిన మహిళను మృత్యువు.. ఆర్టీసీ బస్సు రూపంలో కబలించింది. ఈ ఘటన వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై నాయుడు పెట్రోల్ బంక్ సమీపంలో జరిగింది. ఆర్టీసీ బస్సు అదుపు తప్పి ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో దంపతులు స్వల్పగాయాలతో బయటపడగా, ఓ మహిళ అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ముగ్గురు ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో ఆ ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం చెన్నారావుపేట మండలం సమీప గ్రామాలకు చెందిన బానోతు సుజాత, బాలు దంపతులు బతుకు దెరువు కోసం ఐదేళ్ల క్రితం హనుమకొండ వడ్డేపల్లికి చేరుకున్నారు. ఇక్కడే ఉంటూ భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తూ ఇద్దరి పిల్లలను చదివించుకుంటున్నారు. బానోత్ సుజాత సొంత అక్క భూక్య బుజ్జీ (35). బుజ్జీ తన భర్తకు దూరంగా ఉంటూ తన ఇద్దరు కూతుళ్లను తీసుకుని మూడేళ్ల క్రితం వడ్డేపల్లికి చేరుకుంది. పెద్ద కూతురు భాను 7వ తరగతి చదువుతుండగా చిన్న కూతురును బంధువులకు దత్తత ఇచ్చింది. ఈ క్రమంలో సుజాత, బాలు, బుజ్జీ ముగ్గురు కలిసి ఒకే ద్విచక్రవాహనంపై భవన నిర్మాణ పనికి వెళ్తుంటారు. రోజువారీగానే శనివారం ఉదయం 9 గంటల సమయంలో ఒకే బైక్‌పై వడ్డేపల్లి నుంచి మామునూరుకు బయలుదేరారు. ఈ క్రమంలో వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై నాయుడు పెట్రోల్ బంక్ సమీపంలో వరంగల్ నుంచి తొర్రూరు వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు.. బైక్‌ను ఢీకొంది. దీంతో భార్యాభర్తలు సుజాత, బాలు రోడ్డుపై పడిపోగా.. బుజ్జీ బస్సు వెనక టైర్ కింద పడింది. దీంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. స్వల్పగాయాలతో బయటపడిన భార్యాభర్తలను స్థానికులు వెంటనే 108లో ఎంజీఎం తరలించారు. ఈ విషయం తెలిసిన మృతురాలి కుమార్తె భాను.. తల్లి మృతదేహంపై పడి కన్నీరు మున్నీరుగా విలపించింది. రోడ్డు ప్రమాద విషయం తెలియగానే మామునూరు ఎస్సైలు కృష్ణవేణి, ప్రమోద్‌కుమార్ హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకున్నారు. మహిళ మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. అనంతరం మృతురాలి బంధువు బాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైలు తెలిపారు.

పెద్ద దిక్కు కోల్పోయి..

హన్మకొండ వడ్డేపల్లిలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న భూక్య బుజ్జీ(35).. భవన నిర్మాణ కార్మికురాలిగా పనిచేస్తూ కుమార్తెను చదివిస్తోంది. తన కూతురును ఉన్నతంగా చూడాలకుంది. ఇంతలోనే కనిపించని లోకాలకు వెళ్లింది. బిడ్డను బడికి సాగనంపి చెల్లి, మరిదితో కలిసి బైక్‌పై బయల్దేరిన బుజ్జీ.. కొద్ది నిమిషాల్లోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. దీంతో కూతురు 7 ఏళ్ల చిన్నారి భాను పెద్దదిక్కును కోల్పోయింది.

డ్రైవర్‌ను చితకబాదిన బాధితులు

అతివేగంగా.. నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తోనే రోడ్డు ప్రమాదం జరిగిందంటూ ఆగ్రహానికి లోనైన బాధితులు, స్థానికులు.. ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ను చితకబాదారు. వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని బాధితులు, స్థానికులను ఘటనా స్థలి నుంచి దూరంగా పంపించడంతో గొడవ సద్దుమణిగింది.

మహిళా కార్మికులపై వేధింపులు అరికట్టాలి


మాట్లాడుతున్న రజిత

హన్మకొండ: సంఘటిత, అసంఘటిత రంగాల్లో మహిళా కార్మికులపై జరుగుతున్న వేధింపులను అరికట్టాలని సీఐటీయూ అనుబంధ శ్రామిక మహిళా హనుమకొండ జిల్లా కన్వీనర్ ఎస్.రజిత అన్నారు. హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో శ్రామిక మహిళా జిల్లా సదస్సు శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా కార్మికులపై పురుష కార్మికులు, యజమాన్యాలు ద్వంద్వర్థాల మాటలతో వేధింపులకు గురి చేస్తూ అనేక విధాలుగా హింసకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వేధింపులకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సదస్సులో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, యునైటెడ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వెంకన్న, భూక్య సునీత పాల్గొన్నారు.

పటిష్ట జాబితాను సిద్ధం చేయండి..

వరంగల్ అర్బన్: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పటిష్ట ఓటరు జాబితాను రూపొందించాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీధర్ సూచించారు. శనివారం బల్దియా కార్యాలయంలో వరంగల్ తూర్పు, అసెంబ్లీ ఓటర్ల జాబితాపై ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన పోలింగ్ బూత్‌ల వారీగా ఆయా ఓటరు నమోదు, మార్పులు చేర్పుల గురించి అడిగి తెలుసుకున్నారు. సమీక్షలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్ల, తహసీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పేదల వ్యతిరేక ప్రభుత్వాలను ఓడించాలి

● రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి


మాట్లాడుతున్న ఆకునూరి మురళి

నయీంనగర్: పేదల వ్యతిరేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఓడించాలని రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణలో అవినీతి, ఆర్థిక దోపిడీ రాజకీయాలను ఓడించాలని జాగో తెలంగాణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కులాలు, మతాల వారీగా విభజన రాజకీయాలు చేస్తున్నాయని, వాటిని ఓడించాలన్నారు. రాష్ట్రంలో పేదరికం, నిరుద్యోగం, అవినీతి పెరిగిపోయిందని, ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశాన్ని ప్రైవేట్‌కు అప్పగిస్తోందని, ప్రధాని మోడీ నిర్ణయాలను తిప్పికొట్టాలన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి పథకాల పేరుతో ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. విద్యారంగాన్ని నిర్వీర్యం చేసి రాష్ట్రాన్ని రూ. 5 లక్షల కోట్ల అప్పుతో లూటీ చేశారని మండిపడ్డారు. రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు, నిరుద్యోగం పెరిగిపోయిందని, ప్రజల్లో సమానత్వం లేదన్నారు. అవినీతి లేని సమాజాన్ని నిర్మించడానికి యువత మేలుకోవాలన్నారు. దేశంలో 70 శాతం ఎమ్మెల్యేలు దోచుకోవాలనే ఆలోచనతోనే ఉన్నారని, ప్రజల సంక్షేమం వారికి పట్టదన్నారు. దేశ అసలు జీడీపీ 4.8 అయితే దానిని పెంచి 7.8గా అసత్యప్రచారం చేస్తున్నారన్నారు. ప్రొఫెసర్ వినాయకరెడ్డి, కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ దేశం మొత్తంలో తెలంగాణ చదువులు లాస్ట్.. తాగడంలో ఫస్ట్ అన్నారు. తెలంగాణలో యువకులను తాగుడుకు బానిసలు చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు యాదగిరిచార్యులు, పద్మజాషా, లక్ష్మీనారాయణ, డా.పృథ్వీరాజ్, సైకిబాబు, రమ, గోవర్ధన్ పాల్గొన్నారు.

దళితులను దగా చేస్తున్న సీఎం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్

నయీంనగర్: సీఎం కేసీఆర్ హామీలు నీటి మూటలేనని, 17లక్షల మంది దళితులకు దళితబంధు పథకం అమలు చేయకుండా వారిని దగా చేస్తున్నారని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ విమర్శించారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితబంధు కింద మంజూరైన యూనిట్‌ను అమ్మి ఐదుగురు పంచుకోవాలని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. వర్ధన్నపేటలో దళిత ఎమ్మెల్యే ఉండికూడా దళితులకు అన్యాయం జరుగుతోందని వాపోయారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిటూరి అశోక్ కుమార్, బన్న ప్రభాకర్, విజయ్ కిరణ్, బల్లె విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రేశ్వరాలయ గణపతికి ఘన చరిత్ర

● ఇక్కడ నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేకత
● 55 సంవత్సరాల నుంచి నిర్వహణ..
● నిమజ్జనోత్సవ రథానికి వేలాది భక్తుల మంగళహారతులు

హన్మకొండ కల్చరల్ : స్వాతంత్రోద్యమంలో ప్రజలను ఏకం చేయడానికి లోకమాన్య బాలగంగాధర్ తిలక్ మహారాష్ట్రలో గణేష్ ఉత్సవాలు ప్రారంభించారు. ఈ ఉత్సవాల ద్వారా ప్రజలు చైతన్యం పొంది ఆంగ్లేయులపై పోరాడారు. అలాగే, ఈ ఉత్సవాలు నైజాం ప్రాంతాన్నీ ప్రభావితం చేశాయి. నైజాంకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య పోరులో ఉద్యమకారులకు స్ఫూర్తినిచ్చాయి. ఆ స్ఫూర్తితో తెలంగాణలోని వరంగల్ జిల్లాలో కూడా ప్రారంభించారు.

వేయిస్తంభాల దేవాలయంలో..

హనుమకొండలోని వేయిస్తంభాల దేవాలయంలో జరిగే గణపతి నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేకత ఉంది. అలాగే, నిమజ్జనానికి కూడా ప్రత్యేక ఉంది. ఈ రోజున ఆలయంలో నిమజ్జనోత్సవ రథాన్ని దర్శించుకోవడానికి ప్రజలు మంగళహారతులతో ఎదురు చూస్తారు. వేలాది మంది భక్తులు వినాయకుడిని దర్శించుకుంటారు. పబ్లిక్‌గార్డెన్ వద్ద నిర్వహించిన గణేష్ ఉత్సవాలను 55 సంవత్సరాల క్రితం వేయిస్తంభాల దేవాలయానికి మార్చగా అప్పటి నుంచి గజానన మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఏటా దాతల సహకారంతో గణపతి విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్ఠిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా రోజూ గణపతి రుద్రహోమం, వేలాది మంది భక్తులకు అన్నప్రసాదాల వితరణ జరుగుతోంది. అలాగే, దేవాలయంలోని కాకతీయుల కాలం నాటి మూలమహాగణపతిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహిస్తారు. ఉత్సవాల సందర్భంగా రుద్రేశ్వరస్వామి వారికి అన్నపూజలు నిర్వహిస్తారు. జిల్లా యంత్రాంగం, నగరపాలక సంస్థలు ఏర్పాట్లు చేస్తాయి. రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతాయి.

ఏటా వైభవంగా ఉత్సవాలు..


ఉత్సవాల్లో తొమ్మిది రోజులు గణపతి, రుద్ర హోమాలు, మూలమహాగణపతికి అలంకరణలు జరగడం ఇక్కడి ప్రత్యేకత. వినాయకుడి పంచలోహ ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆలయ చుట్టూ పల్లకీసేవ నిర్వహిస్తాం. దాతల సహకారంతో ఏటా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నాం.
గంగు ఉపేంద్రశర్మ, ప్రధానార్చకుడు, వేయిస్తంభాల ఆలయం

సాక్షి క్లాసిఫైడ్స్

BIRTHDAY GREETINGS



చి॥ తోట మేఘ రుద్రాంశ్

REAL ESTATE

PLOT FOR SALE
■వరంగల్ గ్రేన్ మార్కెట్ దగ్గర 1233.42 sq yards & 260 sq. yards 2 Plots 2 side రోడ్స్ గలవి అమ్మబడును. (మెయిన్ రోడ్ మొగిళ్ల 100 ఫీట్ల రోడ్డు) సంప్ర॥ 7671916416, 9393379778. [W-1229436]

FLAT FOR SALE
■హన్మకొండ జూపార్క్‌కు 300 మీటర్ల దూరంలో ఫాల్ సీలింగ్, లిఫ్ట్, జనరేటర్ సౌకర్యంతో కేవలం రూ.55 3BHK ఫ్లాట్ అమ్మబడును. Ready to move. VRR TULP గలది. సెల్: 6309840767. [WA-7229]

HOUSE FOR SALE
■హన్మకొండ, రాంనగర్‌లో Each Floor 1800 sft తో (260 గ॥లు)G, 1,2 / north face full ఇంటీరియర్ ఉన్న ఇల్లు అమ్మబడును. రేటు 2.3 Cr. Negotiable సంప్ర॥ 8712376150. [WA-7233]
■వరంగల్, మట్టెవాడలోని రేకులపల్లి వాడలో తూర్పు ముఖముతో గల పాత ఇల్లు 113 Sq. yards పక్కా రిజిస్ట్రేషన్ గలది అమ్మకమునకు కలదు. సంప్ర॥ 8331888842. [W-1229433]

షాప్ కిరాయికి ఇవ్వబడును
■ నెహ్రూ పార్క్ దగ్గర స్టేషన్ రోడ్, జనగామలో షాప్ కిరాయికి ఇవ్వబడును వెడల్పు 11½ ఫీట్లు పొడవు 38 ఫీట్లు with Furnicher. Cell: 8096302961. [W-1220759]

COMMERCIAL SALE
■Commercial Property for Sale Land Building 1428 Sq.yds 24500 Builtup Area at Saidabad,Hyd. Rent getting 5 Lakhs. Ph: 9849090098 [HA-346]

SERVICES

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
■మీయొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర॥ డి.ఏస్. రావు, సెల్: 9849145043. [W-1229405]

LOANS
■ బాలాజీ లోన్స్: మార్టిగేజ్ లోన్స్, పర్సనల్ లోన్స్, బిజినెస్ లోన్స్, IT రిటర్న్స్ (GST) చేయబడును. కాకతీయ టాకీస్, వరంగల్. ప్లాట్స్ కొనుగోలుపై ఇవ్వబడును. సంప్ర: 8522825358. [WA-7223]

BUSINESS OFFER
■రాజకీయ రంగంలో అవకాశం, ఎదగాలనే తపనగల స్త్రీ/పు, జనసేవకులు కావలెను. ఆర్థిక సహకారం లభించును. ఫోన్ : 7386275652, 7386425653 [H-793401]
■ప్రతి వ్యాపార వేత్త ఎదుగుదలకు గొప్ప అవకాశం మీ వ్యాపారాన్ని సులువుగా గుర్తింపు (బ్రాండ్) పొందడానికి అనుకూలమైన అతిపెద్ద ప్లాట్ ఫారమ్ కొరకు సంప్ర: 8143514395. [H-788375]

HOME CARE SERVICE
■రామకృష్ణ ఓల్డేజ్ హోమ్ (AP No.1) 24 గం॥ వృద్ధులను, పేషెంట్ల సేవకు, బేబీకేర్, ఇంటిపని, వంటపనికి పని మనుషులను మీ ఇంటికి పంపగలము ✆ 95420 855 88, 95423 05588 [B-1206740]

WANTED
■బాయ్స్ and గర్ల్స్ కావలెను చదువు అనుభవం అవసరం లేదు ఉచిత వసతి జీతం: 10000/– నుండి 15000/– వరకు. సెల్: 9849316058, 8247423557. [W-1229435]
■ జయకృష్ణ ఫార్మసిలో పనిచేయుటకు అనుభవం గల ఫార్మసిస్ట్ కావలెను. ఫార్మసి సర్టిఫికేట్ ఉండాలి. పద్మాక్షి టెంపుల్ రోడ్, హన్మకొండ. సెల్ నెం: 8520027600. [WA-7234]
■ శ్రీ సంతోష్ ట్రాక్టర్స్ సోనాలిక షోరూం మహబూబాబాద్, తొర్రూర్ బ్రాంచిలో పనిచేయుటకు టెలికాలర్స్, రిసెప్షనిస్ట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం, ఇన్సెంటివ్స్ TA+DA ఇవ్వబడును. సంప్ర॥ 9701345204. [W-189177]
■ వరంగల్ స్టేషన్‌రోడ్‌కు గల విష్ణు లాడ్జిలో పని చేయుటకు రూమ్ బాయ్స్ కావలెను. జీ॥ 8000/– మరియు మేనేజర్ ఒక్కరు– జీ॥ 10000/– ఇవ్వబడును. సంప్ర॥ 9391864657 [W-1229414]
■ Wanted MBBS / BAMS/BHMS duty doctors, B.Sc, GNM Nursing Staff X Ray Technicians and Receptionists for a Hospital at Hanamkonda. Cont: 9000282025, 9390672891. [W-1002850]
■ రామకృష్ణ గ్రూపు, విజయవాడ, హైదరాబాద్ కొరకు శ్రీమంతుల ఇళ్లలో ముసలి వారికి సేవ చేయుటకు ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు 10th P/F, 19-30 సం. వర్కర్స్ కావ లెను. భో+వ+ జీ. 18 to 21 వేలు. ఏజెంట్లకు కమీషన్ 5 వేలు. ✆ 86397 56226, 86397 56219 [B-1068113]
■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP No.1) విజయవాడ శ్రీమంతుల ఇండ్లలో ముసలివారికి సేవచేయుటకు M/F కావలెను. భోజనం + వసతి కలదు. జీ: 15-16వేలు. ✆ 8247500792, 8247500683. [B-1206730]
■ Male Only Marketing Executives - For Ready Mix Concrete Any degree, Accountants - Any Degree with Tally, Site Supervisors - Diploma / B.Tech Civil with for all 2-4 Yrs Exp. Drop your Resume on WhatsApp & Contact No: 7330891166, 8555890439, 9849277408 [WA-13357]
■ వరంగల్ పోచమ్ మైదాన్ ఏరియాలో ప్రముఖ ఎలక్ట్రానిక్ షోరూమ్ నందు పని చేయుటకు హెల్పర్స్ (బాయ్స్) అర్జెంటుగా కావలెను. 9గం. డ్యూటీ 4 వీక్లీ ఆఫ్స్. ESI+ PF మంచి జీతం సంప్ర: 9032153413 [H-788684]
■ Wanted Reporters in Each Mandal. All The Districts, Immediate Appointment @ swathi news. Ph : 7997733373 [H-788318]
■ మీరు ఉన్నచోట నుండి డిజిటల్‌గా వర్క్ చేస్తూ ప్రముఖ గ్లోబల్ కంపెనీలో నెలకు 35,000/- వరకు సంపాదించవచ్చు. పార్ట్/ ఫుల్ టైం. ఎటువంటి ఫీజులు లేవు. ఫోన్ 85001 48297. [V-797408]
■ గాయత్రి గ్రూపు, VJA, HYD శ్రీమంతుల ఇళ్లలో వృద్ధుల సేవకు వంట/ఇంటిపని, బేబీకేర్ వర్కర్స్ కావలెను. జీ. 15 to 22 వేలు. ఏజెంట్లకు కమీషన్ 5 వేలు ✆ 62812 08600, 6281208656 [B-1068117]
■ మా ఆఫీసు న్యూ బ్రాంచేజ్ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైం వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926 [G-751693]
■ త్రివేణి హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి+భోజనం. జీతం:18K. Ph : 9848571888 / 9640400073. [H-189335]
■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (TS.No.-1) హైదరాబాద్‌లో శ్రీమంతుల ఇండ్లలో ముసలివారికి సేవ చేయుటకు M/F కావలెను. భోజనం + వసతి + జీతం 15-16వేలు. ఫోన్ 9618221160, 9133271122 [H-788535]

LAND FOR SALE
■రెండు ఎకరాల వ్యవసాయ భూమి అమ్మకానికి కలదు. Near వంగపల్లి క్రాస్ రోడ్, గ్రా॥ లక్ష్మీపూర్, వరకాల - హుజురాబాద్ హైవే, మం॥ కమలాపూర్, జిల్లా హన్మకొండ. 8121374317. [W-189178]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/-రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9010144453
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.